# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

రిపోర్టర్లు కావలెను

ప్రజాక్షేత్రం

కాల్ : 9177920459

సంపుటి: 01 | సంచిక: 329 | హైదరాబాద్ | శుక్రవారం | 16-05-2025 | పేజీలు: 08 | వెల 4/-



# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం


రిపోర్టర్లు కావలెను

ప్రజాక్షేత్రం

కాల్ : 9177920459




సంపుటి: 01 | సంచిక: 329 | హైదరాబాద్ | శుక్రవారం | 16-05-2025 | పేజీలు: 08 | వెల 4/-


## లక్షల్లో వసూలు చేసి, బోర్డు తిప్పేసిన..

# ఐటీ కంపెనీ

- ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ బోర్డు తిప్పేసిన ఐటీ కం పెనీ..
- బాధితుల వద్ద నుంచి రూ. 2 లక్షలకు పైగా వసూలు..
- మోసపోయామంటూ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు..




3

## రూ.8 వేల కోట్లు బకాయిలపై

## బండి సంజయ్ ఆగ్రహం

- ప్రభుత్వ నిర్లక్ష్యంతో కళాశాలలు మూతపడుతున్నాయ్
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ప్రభుత్వం

3



### కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో రేవంత్ రెడ్డి

## తన తప్పు ఒప్పుకోవాలి



3

## యాదాద్రి, పోచంపల్లి సందర్శించిన అందాల భామలు

ఇకత్ చీరలు చూసి మురిసిపోయిన సుందరీమణులు



3

## అందాల రాశులా..? ధాన్యపు రాశులా..?

### రేవంత్ సర్కారు ప్రాధాన్యత ఏంటి..?



3

## జూన్ 2న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో యువ కవుల సమ్మేళనం..

పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత



3

## పుష్కర స్నానంతో

# మహా పుణ్యం

- రూ.200 కోట్లతో కాళేశ్వరం పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి
- ప్రకృతి ఆశీర్వాదంగా గోదావరి నది
- గోదావరి పుష్కరాల వరకు మాస్టర్ ప్లాన్ అమలు చేస్తా..



3

## అందాల భామలపై నీళ్లు పోస్తే కాళ్లు కడిగినట్టేనా?

### బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ఫైర్



3

## సోనియాగాంధీకి బీఆర్ఎస్ మహిళా నేతలు లేఖ

రేవంత్ సర్కార్ తెలంగాణ మహిళలను అవమానించారని లేఖ



4

ప్రజాక్షేత్రం
తెలుగు దినపత్రిక
16.05.2025
శుక్రవారం | హైదరాబాద్

# రూ.8 వేల కోట్లు బకాయిలపై బండి సంజయ్ ఆగ్రహం

- ప్రభుత్వ నిర్లక్ష్యంతో కళాశాలలు మూతపడుతున్నాయ్
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ప్రభుత్వం

**హైదరాబాద్ మే 15(ప్రజాక్షేత్రం):**

తెలంగాణలో ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల అంశంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను ప్రభుత్వమే విస్మరించిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 8,000 కోట్ల ఫీజు బకాయిలు పేరుకుపోయాయని ఆయన లేఖలో పేర్కొన్నారు. బండి సంజయ్ పేర్కొన్న వివరాల ప్రకారం, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.

అధ్యాపకులకు జీతాలు, సిబ్బందికి భత్యాలు, కాలేజీల నిర్వహణ ఖర్చులు కూడా భరించలేని స్థితిలో ఉన్నాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడటం ప్రారంభించాయని బండి సంజయ్ హెచ్చరించారు. విద్యార్థులకు ఫీజులు చెల్లించనిదే సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యాల మధ్య వాగ్వాదాలు తీవ్రమై పోలీస్ స్టేషన్ల దాకా కేసులు వెళ్లుతున్నాయని అన్నారు.

అసెంబ్లీ సాక్షిగా ఫీజు బకాయిలను వన్ టైం సెటిల్ మెంట్ చేయాలని ఒకసారి, మరోసారి 12 వాయిదాల్లో చెల్లిస్తామని ముఖ్యమంత్రి మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ మాటలను విస్మరించడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. ఈ విద్యా సంవత్సరం నుండే బకాయిలను నిర్ణీత వ్యవధిలో చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. బండి సంజయ్ ప్రభుత్వానికి హితవు పలుకుతూ, విద్యార్థుల భవిష్యత్తును, కళాశాలల మనుగడను దృష్టిలో పెట్టుకుని తక్షణమే బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యారంగంపై ప్రభుత్వం చూపుతున్న అలసత్వం లక్షలాది మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మానసిక క్షోభ కలిగిస్తోందని తీవ్రంగా విమర్శించారు.

# కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో రేవంత్ రెడ్డి తన తప్పు ఒప్పుకోవాలి

**హైదరాబాద్ మే 15(ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో రేవంత్ రెడ్డి తన తప్పు ఒప్పుకోవాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు.

ప్రభుత్వం తరపున వాదిస్తున్న అడ్వకేట్‌ను సుప్రీంకోర్టు హెచ్చరించింది. కంచ గచ్చిబౌలి అడవుల విధ్వంసానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పలువురు అధికారులను జైలుకు పంపించాలా అంటూ హెచ్చరించింది. రేవంత్ రెడ్డి చేసిన తప్పులకు తెలంగాణ ప్రభుత్వ అధికారులు శిక్ష ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ అధికారులకు సుప్రీంకోర్టు హెచ్చరికలు జారీ చేసింది. రేవంత్ రెడ్డి మూర్ఖత్వం వల్ల అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుంది. వీటన్నింటికీ తాను బాధ్యుడిని కాదని రేవంత్ రెడ్డి తప్పించుకునే అవకాశం లేదు అని కేటీఆర్ పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై, కంచె గచ్చిబౌలి వ్యవహారంలో చేసిన తప్పులను ఒప్పుకోవాలి. వందల బుల్డోజర్లతో ధ్వంసం చేసిన కంచె గచ్చిబౌలి అడవులను తిరిగి పునరుద్ధరించాలి. లేకుంటే రేవంత్ రెడ్డికి కోర్టు శిక్షలు తప్పవు. కంచె గచ్చిబౌలి భూములను అమ్మి పది వేల కోట్ల రూపాయల స్కాం చేయడం ముమ్మాటికి అవినీతి, నమ్మక ద్రోహమే. సెలవు దినాల్లో బుల్డోజర్లను పంపి అడవులను ధ్వంసం చేయడం ముమ్మాటికి పర్యావరణ చట్టాల ఉల్లంఘనే. రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్య చర్యల ఫలితంగా పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగింది. కంచె గచ్చిబౌలి భూములను ప్రభుత్వం కాపాడాల్సిందే. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తాను సృష్టించిన విధ్వంసానికి, తన బాధ్యతారాహిత్యానికి, చేసిన పది వేల కోట్ల స్కాంకు బాధ్యత వహించాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు.



# యాదాద్రి, పోచంపల్లి సందర్శించిన అందాల భామలు

## ఇకత్ చీరలు చూసి మురిసిపోయిన సుందరీమణులు

**హైదరాబాద్ మే 15(ప్రజాక్షేత్రం):**

మిస్ వరల్డ్ పోటీదారులు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని, పోచంపల్లి చేనేత పరిశ్రమను సందర్శించారు. స్థానిక ప్రజలు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇకత్ చీరలను పరిచయం చేశారు. అంతేకాకుండా తయారీ విధానాన్ని కూడా పరిశీలించి.. అనంతరం స్వయంగా చీరలను నేసి సంతోషపడ్డారు.

సాంస్కృతిక వారసత్వం. ఇక్కత్ చీరల నేతకు ప్రపంచ ప్రసిద్ధి చెందింది. అలాంటి భూదాన్ పోచంపల్లి గ్రామ చేనేత పార్క్‌ను ఈసారి అంతర్జాతీయ సుందరీమణుల మన్ననలు పొందింది. ఆఫ్రికా ఖండం నుంచి వచ్చిన 25 దేశాల మిస్ వరల్డ్ పోటీదారులు ఈ గ్రామాన్ని సందర్శించి.. స్థానిక సంస్కృతి, కళలు, మ్యూజిక్‌తో మమేకమయ్యారు. సిందూరం, సంగీతం, చేతి నేతల మధ్య కళాత్మకమైన ఈ సందర్శనం అతిథుల హృదయాలను రంజింపజేసింది.

గ్రామ చేనేత పార్క్ ప్రవేశద్వారం దగ్గరే స్థానికులు సంప్రదాయ దుస్తుల్లో అందాల భామలకు స్వాగతం పలికారు. సిందూరం నుదుట దిద్ది.. పువ్వుల మాలలు అందించారు. పోచంపల్లికి హృదయపూర్వక స్వాగతం అంటూ అందగత్తెలకు హృదయాలను హత్తుకునేలా ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్క్ మ్యూజియంలోని స్టాల్‌లను సందర్శించారు.

ప్రత్యేకమైన ఇక్కత్ చీరల తయారీ విధానాన్ని స్థానిక పార్కులో పరిశీలించిన అతిథులు.. నూలు వడకడం నుంచి రంగులు చొప్పించే క్లిష్టమైన ప్రక్రియలను చూసి ఆశ్చర్యచకితులయ్యారు. ఒక్క చీరకు వారాలు తీసుకునే శ్రమ, డిజైన్ల సృజనాత్మకత కంటెస్టెంట్ల మనసును హత్తుకుంది. చీరలపై భిన్న డిజైన్లను గమనించిన అతిథులు, కొందరు స్వయంగా రాట్నంతో నూలు వడికే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం హనుమంత రావు, భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అలాగే యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి కరేబియన్ దేశాలకు చెందిన 9 మంది సుందరీమణులు వచ్చారు. ఆలయ గెస్ట్ హౌస్ దగ్గర అధికారులు ఘన స్వాగతం పలికారు. గెస్ట్ హౌస్ నుంచి బ్యాటరీ వాహనాల్లో ఆలయ మాడ వీధుల్లో విహరించారు.

# అందాల భామలపై నీళ్లు పోస్తే కాళ్లు కడిగినట్టేనా?

**బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ఫైర్**

**హైదరాబాద్ మే 15(ప్రజాక్షేత్రం):**



తెలంగాణ మహిళలతో అందాల భామల కాళ్లు కడిగిస్తారంటూ బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రానికి ఇది తీవ్ర అవమానకరమని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మిస్ వరల్డ్ పోటీదారులు ములుగు, రామప్ప దేవాలయ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా రామప్ప దేవాలయంలోకి వెళ్లే ముందు అందాల భామలు కాళ్లు కడుక్కుని వెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళలు నీళ్లు పోయడం వివాదాస్పదమైంది.తాజాగా ఈ వ్యవహారంపై మంత్రి సీతక్క స్పందిస్తూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. వరంగల్ జిల్లాలో అందాల భామల హెరిటేజ్ వాక్ సక్సెస్ కావడంతో బీఆర్ఎస్ నేతలు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని ధ్వజమెత్తారు. కావాలనే కోడి గుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

ఇవాంక ట్రంప్ హైదరాబాద్ వచ్చినప్పుడు ఆమె వెంట తిరిగిన నాయకుడు ఎలాంటి సంస్కృతి సంప్రదాయాలు పాటించారో అందరికీ తెలుసన్నారు. గిరిజన సంప్రదాయంలో గుడిలోకి వెళ్లే ముందు కాళ్లు కడుగుకొని వెళ్లడం సంప్రదాయం.. అదే అక్కడ పాటించారన్నారు. ఆ సమయంలో ఒక ఈవెంట్ మేనేజ్‌మెంట్ అమ్మాయి.. కాళ్లకు నీళ్లు పోసిందని.. దాన్ని పట్టుకుని నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక వేళ తెలంగాణ ప్రభుత్వం కాళ్లు కడిగిస్తే.. అందరి కాళ్లు కడిగించాలి కదా? కానీ అక్కడ అలా జరగలేదన్నారు. అయినా దాన్ని ప్రభుత్వానికి అంటగట్టడం సిగ్గు అనిపించడం లేదా? అని బీఆర్ఎస్ నేతలపై ఫైరయ్యారు.

కవితమ్మ కాళ్ల దగ్గర కలెక్టర్‌ను కూర్చోబెట్టినప్పుడు.. కేసీఆర్ కలెక్టర్లతో కాళ్లు మొక్కించుకోవడం మీ దుహంకారం కాదా? ఈ తీరు నచ్చకే కదా ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారని పేర్కొన్నారు. అసలు తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత మీకుందా? తెలంగాణ పేరునే మీ పార్టీ పేరులో నుంచి తీసేశారు కదా? అని ప్రశ్నించారు. ఈ మధ్య సబితా ఇంద్రారెడ్డి ములుగు మీద పచ్చి అబద్ధాలు చెబుతున్నారని.. ఆమె మంత్రిగా ఉన్నప్పుడు ఏం మానవత్వం చూపిందో తెలుసన్నారు. వాస్తవాలు మాట్లాడాలని.. అబద్ధాలు కాదని హితవు పలికారు. ఇప్పటికైనా అబద్ధాలకు అంబాసిడర్‌గా సబితమ్మ మారొద్దన్నారు. అధికారం పోయాక ప్రజల ఆత్మగౌరవం గుర్తొచ్చిందా? అంటూ మంత్రి నిలదీశారు.

# జూన్ 2న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో యువ కవుల సమ్మేళనం..

**పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత**

**హైదరాబాద్ మే 15(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీన యువ కవుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ జాగృతి ప్రకటించింది. తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరగనున్న ఈ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం నాడు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన నివాసంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... తెలంగాణ జీవనశైలి విశిష్టతను చాటి చెప్పడంతో పాటు యువతలో సాహితీ స్పృహను, చైతన్యాన్ని పెంపొందించడానికి ఈ యువ కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ తాత్వికతను, చరిత్రక నేపథ్యాన్ని, సాంస్కృతిక వైభవాన్ని, సౌభ్రాతృత్వాన్ని, సహనశీలతను, సమగ్రతను, సమాజంలో ఉండే సమిష్టితత్వాన్ని ప్రతిబింబించేలా యువ కవులు తమ కలాలకు పదును పెట్టాలని కవిత పిలుపునిచ్చారు.

పాల్గొన దలచిన కవులు, కవయిత్రులు 35 ఏళ్ల లోపువారు అయి ఉండాలి. తెలుగు, హిందీ ఇంగ్లీష్, ఉర్దూలలో కవితలు వినిపించవచ్చు. నమోదు చేయించుకోవడానికి కవులు తమ వివరాలతో ఈ నెల 26లోపు kavitha.telangana@gmail.com కు మెయిల్ చేయాలి.

కవులు తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ చరిత్రను, పోరాట స్ఫూర్తిని చాటిచెప్పాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ నేల మీద అనేక గొప్ప కవులు, కవయిత్రులు తమ రచనల ద్వారా సామాజంలో చైతన్యాన్ని రగిలించారని, ఆ పరంపరను కొనసాగించడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. గోల్కొండ కవుల సంచిక ద్వారా సురవరం ప్రతాప్ రెడ్డి తెలంగాణ రచయితలు, కవులు, కవయిత్రుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పారని, ఆ స్ఫూర్తితో తాము ముందుకు సాగుతున్నట్లు తెలియజేశారు.

అయితే, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సాహిత్యానికి కనీస గౌరవం ఇవ్వడం లేదని విమర్శించారు. దాశరథి శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడ్డట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అలాగే, జానపదానికి గౌరవం దక్కడం కోసం జీవితాంతం కృషి చేసిన బిరుదురాజు శత జయంతి కు రాష్ట్ర ప్రభుత్వం కనీస గౌరవం ఇవ్వలేదని, గొప్ప కవులు, కళాకారులు సమాజానికి చేసిన సేవలను ప్రభుత్వం విస్మరించడం తగదని సూచించారు. ఈ కార్యక్రమంలో కవులు కాంచనపల్లి, వనపట్ల సుబ్బయ్య, ఘనపురం దేవేందర్, జాగృతి నాయకులు నవీన్ ఆచారి, శ్రీధర్ రావు, మనోజ్ గౌడ్, లలిత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




# పుష్కర స్నానంతో మహా పుణ్యం

- రూ.200 కోట్లతో కాళేశ్వరం పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి
- ప్రకృతి ఆశీర్వాదంగా గోదావరి నది
- గోదావరి పుష్కరాల వరకు మాస్టర్ ప్లాన్ అమలు చేస్తా..

**హైదరాబాద్ మే 15(ప్రజాక్షేత్రం):**

పుష్కరాల లో పుణ్య స్నానం చేస్తే పుణ్యం లభిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు (గురువారం) సరస్వతి పుష్కరాలకు 4.12 నిమిషాలకు కాళేశ్వరం విచ్చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన టెంట్ సిటీని పరిశీలించారు.

జ్ఞాన సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేరిన 17 అడుగుల ఏక శిలా సరస్వతి మాతా విగ్రహాన్ని ఆవిష్కరించి సరస్వతి ఘాట్ ను ప్రజలకు అంకితం చేశారు. అనంతరం అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కర స్నానం ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని, శుభానందదేవిని, ప్రౌఢ సరస్వతి మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సరస్వతి ఘాట్ లో పుష్కరాలపై భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నా హయంలో ఇలాంటి గొప్ప కార్యక్రమం నిర్వహించడం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.

రాష్ట్రంలో అయినా, దేశంలో అయిన నదులను పూజించడం మన సంస్కృతి, సంప్రదాయమని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరడం జరిగిందని, మంథని నియోజకవర్గానికి పెద్ద చరిత్ర ఉన్నదని తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఆద్యుడు పివి నరసింహారావు మంథని వాసి అన్నారు.

ప్రపంచంలో మన దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేసిన పీవీ నరసింహా రావు మంథని బిడ్డ, తదుపరి శ్రీపాదరావు ప్రాతినిధ్యం వహించారని అన్నారు. శ్రీపాద రావు సభను ఎంతో హుందాగా నడిపించారని తెలిపారు. రాష్ట్రంలో లక్షల కోట్లు విదేశీ, స్వదేశీ పెట్టు బడులను పెట్టించడం, ప్రైవేట్ రంగంలో వేల కోట్ల పెట్టు బడులను తేవడం రాష్ట్రం అభివృద్ధిలో శ్రీధర్ బాబు కృషి చాలా గొప్పదని అన్నారు.మంథని నియోజక వర్గ అభివృద్ధికి.నిరంతరం కష్టపడే శ్రీధర్ బాబును ప్రజలే కాపాడుకోవాలన్నారు. ఆయన సేవలు రాష్ట్రం యావత్తు అవసరమని, ఆయన నియోజకవర్గ అభివృద్ధి కి తక్కువ సమయం కేటాయింపు చేసి రాష్ట్ర అభివృద్ధికి ఎక్కువ సమయం కేటాయించాలని తెలిపారు.

శ్రీధర్ బాబు రోజుకు 18 గంటలు పని చేస్తున్నారని కొనియాడారు. కాళేశ్వరం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ చేయాలని మంత్రి కోరారని, కానీ రూ.100 కోట్లు కావాలని అడిగారని తాను రూ.200.కోట్లు ఇస్తానని ప్రముఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

రాష్ట్రంలోనే కాళేశ్వరాన్ని గొప్పగా అభివృద్ధి చేయాడానికి వంద కాదు, రెండు వందల కోట్లు కేటాయించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తా అన్నారు. గోదావరి, కృష్ణా పుష్కరాలను, సమ్మక్క సారాలమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున గ్రీన్ ఛానల్ లో నిధులు విడుదల చేస్తా అన్నారు.

మంథని నియోజక వర్గం ప్రజలు అదృష్టంగా గర్వంగా ఫీలయ్యే నాయకుడు మంత్రి శ్రీధర్ బాబు అని, తప్పకుండా మంథని నియోజక వర్గం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. సరస్వతి పుష్కరాలు ఘనంగా నిర్వహించుటకు ఏర్పాట్లు చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను, ఇతర శాఖల అధికారులను అభినందించారు.



# లక్షల్లో వసూలు చేసి, బోర్డు తిప్పేసిన ఐటీ కంపెనీ..

- ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ బోర్డు తిప్పేసిన ఐటీ కంపెనీ..
- బాధితుల వద్ద నుంచి రూ. 2 లక్షలకు పైగా వసూలు..
- మోసపోయామంటూ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు..

**హైదరాబాద్ మే 15(ప్రజాక్షేత్రం):**

మన సమాజంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అంటే ఓ మోజు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అంటేనే ఊళ్లలో, బంధువుల్లో గౌరవం. చివరకు వివాహం సంబంధాల్లో కూడా ఐటీ ఎంప్లాయ్ అంటేనే ముద్దు. ఇలాంటి పరిస్థితుల్లో, యువత ఐటీ జాబ్ సంపాదించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. తల్లిదండ్రులు కూడా తమ కొడుకు హైదరాబాద్, బెంగళూర్ లేదా వీలైతే విదేశాల్లో ఐటీ జాబ్ చేయాలనే కలలు కంటున్నారు. ఈ ఆశల్ని కొందరు మోసగాళ్లు క్యాష్ చేసుకుంటున్నారు. ఉద్యోగాల పేరిట చాలా ఫేక్ ఐటీ కంపెనీలు ఉద్యోగం ఆశిస్తున్న వారి నుంచి లక్షల్లో దండుకుని బోర్డు తిప్పేస్తున్నాయి.

తాజాగా, మరోసారి ఇలాంటి సంఘటనే హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. గచ్చిబౌలిలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ బోర్డు తిప్పేసింది. తమ వద్ద ట్రైనింగ్ తీసుకున్న వారికి జాబ్స్ ఇప్పిస్తామని ప్యూరోపెల్ క్రియేషన్ అండ్ ఐటీ సొల్యూషన్స్ అనే కంపెనీ పలువురిని మోసం చేసింది. వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగాలు ఉంటాయని చెబుతూ, చాలా మంది వద్ద నుంచి విడతల వారీగా రూ. 2 లక్షలకు పైగా వసూలు చేసింది. జాబ్స్ లేకపోవడంతో గచ్చిబౌలిలోని ఆఫీస్‌కి వెళ్లగా, అక్కడ బోర్డు లేకపోవడంతో తాము మోసపోయినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో సుమారు 200 మంది మోసపోయారు. తమ వద్ద నుంచి లక్షల్లో డబ్బు వసూలు చేశారని బాధితులు లబోదిబోమంటున్నారు. బాధితులు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# అందాల రాశులా..? ధాన్యపు రాశులా..? రేవంత్ సర్కారు ప్రాధాన్యత ఏంటి..?

రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి సర్కారు ప్రాధాన్యత ధాన్యపు రాశులా..? లేకపోతే అందాల రాశులా అని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీష్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం రోజు తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణలో అందాల పోటీ నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి, మంత్రులు చెబుతున్నారన్న ఆయన... పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం వారం రోజులపాటు నిర్వహించిన ఈ మొబిలిటీ వీక్ ఫార్ములా ఈ రేస్‌పై కాంగ్రెస్ పార్టీ విషం చిమ్మిందన్నారు. ఫార్ములా ఈ రేస్ జరగడానికి వారం రోజుల ముందే రూ. 40 కోట్ల ఖర్చుతో వేల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిది, అప్పటి మంత్రి కేటీఆర్‌దని తెలిపారు. కానీ.. కేటీఆర్‌కు, గత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న దురుద్దేశంతో ఫార్ములా రేసు మళ్లీ రాష్ట్రానికి రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుందని మండిపడ్డారు.

కానీ ఇదే కాంగ్రెస్ ఇప్పుడు ప్రభుత్వంలోకి వచ్చాక రూ. 200 కోట్లు ఖర్చుపెట్టి అందాల పోటీలు నిర్వహిస్తుందని వీటి ద్వారా ఇప్పటివరకు ఒక్క రూపాయి అయినా పెట్టుబడి వచ్చాయా సతీష్ రెడ్డి ప్రశ్నించారు. ఒక్క రూపాయి పెట్టుబడి కూడా తీసుకురాకుండా లక్ష రూపాయలకు ప్లేటు చొప్పున భోజనం అందాల భామలకు వడ్డిస్తూ తెలంగాణ ప్రజల విలువైన సొమ్మును వృథా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గుజరాత్‌లో ట్రంప్ వచ్చినప్పుడు అడ్డుగోడలు కట్టినట్టు ఇప్పుడు వీధి వ్యాపారులను తొలగించి వారి జీవితాన్ని రోడ్డుపాలు చేసి పిల్లల భామలను రామప్ప తీసుకెళ్లారని అన్నారు. ఇప్పుడు

రూ.200 కోట్లు ఎవరికి కావాలి ..? ఫార్మర్‌కి కావాలా..? ఫ్యాషన్ కి కావాలా..? ఇబ్బందులు పడుతున్న రైతులకు కావాలా..? సర్కారు ప్రాధాన్యత ఏంటి అని ప్రశ్నించారు. అకాల వర్షాలతో కల్లాల్లో పంటలు దెబ్బతిని వరదలో వడ్లు కొట్టుకపోతుంటే ఆడబిడ్డలు కన్నీళ్లు పెడుతున్నా.. ఏ ఒక్క మంత్రి కూడా అటువైపు కన్నెత్తి చేసిన పాపాలు పోవడం లేదన్నారు. ములుగు జిల్లాలో 200 ఎకరాల్లో పంట నీటిపాలై రైతులు ఏడుస్తూ ఉంటే స్థానిక ఎమ్మెల్యే మంత్రి సీతక్క రైతులను పరామర్శించకుండా అందాల పోటీల పేరుతో వారితో తిరుగుతూ జల్సాలు చేశారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

ఆదిలాబాద్ జిల్లాలో మిషన్ భగీరథ పనిచేయక తాగునీటి కోసం మహిళలు కిలోమీటర్ల దూరం నడుస్తున్నారని...వారిని పట్టించుకునే తీరిక..వారి కోసం డబ్బులు ఖర్చు పెట్టే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదన్నారు. ఓవైపు రైతులు ఆడబిడ్డ లేడుస్తుంటే వారిని పట్టించుకోకుండా అందగత్తెలను బస్సుల్లో తిప్పుకుంటూ వారికి డిన్నర్ ఇస్తూ జల్సాలు చేస్తున్నారని ఆరోపించారు. అదే రూ. 200 కోట్లు ఖర్చు పెడితే ఇప్పటివరకు ఎంత ధాన్యాన్ని కొనుగోలు చేసేదో ప్రభుత్వం, రాష్ట్ర ప్రజలు ఆలోచించాలని అన్నారు. తెలంగాణ సొమ్ము ఎవరికోసమో ప్రజలు ఆలోచించాలని వై సతీష్‌రెడ్డి కోరారు.

# వివేకానందుని విగ్రహం ధ్వంసం

- ఘటనకు నిరసనగా బంద్
- రాస్తారోకో నిర్వహించిన వివిధ సంఘాలు
- నిరసనగా బైక్ ర్యాలీ

**ప్రజా క్షేత్రం నంగునూరు, మే 15:** మండల కేంద్రమైన నంగునూరులోని వివేకానంద సర్కిల్లో ఏర్పాటు చేసిన వివేకానంద విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో నంగునూరులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను, రాజగోపాలపేట ఎస్సై ఆసిఫ్ ఆధ్వర్యంలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ గురువారం నంగునూరులో బందు పాటించారు. వివేకానంద యూత్ అసోసియేషన్, వివిధ సంఘాలు, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నంగునూరులో బైక్ ర్యాలీ నిర్వహించారు అనంతరం వివేకానంద సర్కిల్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో వల్ల వాహనాలు నిలిచిపోయాయి. టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, బీజేపీ సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకట్ రామిరెడ్డి, బీజేపీ నాయకులు కోల సతీశ్, పప్పు సురేందర్ రెడ్డి, జీడిపల్లి రజనీకర్ రెడ్డి, గంధం పరమేశ్వర్ రెడ్డి, పరకాల తిరుపతి రెడ్డి, అమిరిశెట్టి ప్రవీణ్, కుమార్ తుపాకుల నరేశ్, బూరుగు శ్రీనివాస్, సాధువుల నరేందర్, కాంగ్రెస్ నాయకులు చెలికాని యాదగిరి, గోనెపల్లి శివగౌడ్, బొల్లు సంజీవ్, కమలాకర్, తదితరుల ఆధ్వర్యంలో ఈ ర్యాలీ, రాస్తారోకో జరిగింది. ఈ సందర్భంగా ఆయా పార్టీలు వివిధ



సంఘాల నాయకులు మాట్లాడుతూ వివేకానందుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వివేకానంద విగ్రహ ధ్వంసం ఘటన మంగళవారం రాత్రి ఘటన జరిగిందని భావిస్తున్నారు. బుధ వారం సాయంత్రం 7 గంటల సమయంలో వివేకానంద విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయాన్ని గుర్తించారు. విగ్రహం ముక్కు, గదబ ధ్వంసం అయింది. ఈ సంఘటనపై వివేకానంద యూత్ అసోసియేషన్ సభ్యులు, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి బుధవారం రాత్రి రాజగోపాలపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. వివిధ సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో గురువారం బందుకు పిలుపునిచ్చి బందు పాటించి, నిరసనగా బైక్ ర్యాలీ, రాస్తారోకో వహించారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో పోలీసులు వివేకానంద విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని మూడు రోజుల్లో పట్టుకొని చట్టపరంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో ముగిసింది.

# సోనియాగాంధీకి బీఆర్ఎస్ మహిళా నేతలు లేఖ

**రేవంత్ సర్కార్ తెలంగాణ మహిళలను అవమానించారని లేఖ**

**హైదరాబాద్ మే 15(ప్రజాక్షేత్రం):** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీకి బీఆర్ఎస్ మహిళా నేతలు లేఖ రాశారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కోవా లక్ష్మీ లేఖ రాశారు. తెలంగాణ ఆడబిడ్డలతో విదేశీ మహిళల కాళ్లు కడిగించిన సంఘటనలు రాష్ట్ర మహిళల ఆత్మ గౌరవాన్ని అవమానించే విధంగా ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. ఆత్మగౌరవంతో సాధించుకున్న తెలంగాణను బానిసత్వం వైపు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నడిపిస్తోందని తెలిపారు. గత 18 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను అడుగడుగునా మోసం చేస్తోందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే తన తీరు మార్చుకోవాలని లేఖలో స్పష్టం చేశారు. విదేశీ మహిళలకు కాళ్లు కడిగించిన ఘటన తీవ్రమైన దుమారానికి, వివాదానికి దారితీస్తోందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మహిళలకు, తల్లులకు, అక్కాచెల్లెళ్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర మహిళలు కాంగ్రెస్ పార్టీపై తిరగబడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

బుధవారం మిస్ వరల్డ్ పోటీదారులు ములుగు, రామప్ప దేవాలయ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా రామప్ప దేవాలయంలోకి వెళ్లే ముందు అందాల భామలు కాళ్లు కడుక్కుని వెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళలు నీళ్లు పోయడం వివాదాస్పదమైంది. తెలంగాణ మహిళలతో అందాల భామల కాళ్లు కడిగిస్తారంటూ బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రానికి ఇది తీవ్ర అవమానకరమని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా బీఆర్ఎస్ మహిళా నేతలు.. సోనియాగాంధీకి లేఖ రాశారు.

ఈ వ్యవహారంపై మంత్రి సీతక్క స్పందిస్తూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. వరంగల్ జిల్లాలో అందాల భామల హెరిటేజ్ వాక్ సక్సెస్ కావడంతో బీఆర్ఎస్ నేతలు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని ధ్వజమెత్తారు. కావాలనే కోడి గుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

# పాలీసెట్ లో కొంతంగి విద్యార్థికి రాష్ట్ర మొదటి ర్యాంకు

**ఫోన్లో అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ**

**శంఖవరం,మే15(ప్రజాక్షేత్రం):** శంఖవరం మండలం కొంతంగి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు బద్ది లోవరాజు కుమారుడు శశి వెంకట్ ఇటీవల జరిగిన పదో తరగతి సి బీ ఎస్ ఈ పరీక్షల్లో 484/500 మార్కులు, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏ పి ఆర్ జే సి సెట్) లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ ర్యాంకు,పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్టులో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించినందుకు శాసనసభ్యురాలు శ్రీమతి వరుపుల సత్యప్రభ రాజా శశి వెంకట్ ను అభినందించారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే సత్య ప్రభ శశి వెంకట్ కి ఫోన్ చేసి ఫోన్లో అభినందనలు తెలిపారు..నీ ర్యాంకులతో నియోజవర్గంలో యువకులకు స్ఫూర్తినింపావని,బస్సు సౌకర్యం కూడా లేని



గ్రామం నుండి విద్యాభ్యాసం కొనసాగించి,రాష్ట్రస్థాయిలో ర్యాంకుల సాధించడం అద్భుతమైన విషయమని అన్నారు.ఇదే స్ఫూర్తితో ఉన్నత స్థాయి విద్యాభ్యాసం కొనసాగించాలని,జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని,భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో నిలవాలని కోరుకుంటున్నాను అని శశి వెంకట తో ఎమ్మెల్యే అన్నారు..

# మళ్లీ అధికారంలోకి వస్తాం

**వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరి బాబు**

**రౌతులపూడి,మే 15 (ప్రజాక్షేత్రం):** రాష్ట్రంలో మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందని వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసే వరకు కష్టపడి పని చేద్దామని వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడగిరి బాబు అన్నారు. రౌతులపూడి,రౌతులపూడి మండలం లో ములగపూడి, రాజవరం గ్రామాల్లో వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పర్యటించారు. పలు శుభ కార్యక్రమాల్లో పాల్గొని కార్యకర్తలను మర్యాదపూర్వకంగా కలిశారు. రాజవరం గ్రామానికి చెందిన పంచాడ అశోక్ తండ్రి అప్పలనాయుడు ఇటీవల కాలంలో ఆపరేషన్ చేయించుకోవడంతో అప్పలనాయుడును పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాజవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు సోమరౌతు తిరుమల వెంకన్న దొర తల్లి వెంకయమ్మ ఇటీవల కాలంలో మరణించడంతో వెంకయ్యమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.గిరిబాబు మాట్లాడుతూ తిరుమల వెంకన్న దొర కుటుంబానికి మా కుటుంబానికి దశాబ్దాల కాలం నుండి అనుబంధమని గ్రామానికి వారు చేసిన సేవలను కొనియాడారు.దొర కుటుంబానికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని దొరకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వాసిరెడ్డి జమీల్, వైస్ ఎంపీపీ సాయి,సర్పంచ్ లు సైపు రెడ్డి వెంకటరమణ,కోరుప్రోలు దేవుడుబాబు,చింతకాయల సత్యనారాయణ, గొల్లు రమణ, సర్నం శ్రీను,సైపు తదితరులు పాల్గొన్నారు.



# అన్నమయ్య కళా క్షేత్రం వారిచే భజన బృందం గురువులకు అవార్డుల ప్రధానం

**ప్రత్తిపాడు,మే 15(ప్రజాక్షేత్రం):** ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం ద్వారక తిరుమలలో అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో భజన బృందం గురువులకు అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి శ్రీ విజయశంకర స్వామి వారి చేతుల మీదుగా అన్నమయ్య అవార్డుల ప్రధానోత్సవం వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అన్నమయ్య కళా పరిషత్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం,కాకినాడ జిల్లా అన్నమయ్య కళా పరిషత్ అధ్యక్షులు అన్నమయ్య సానా నూకరాజు నాయుడు,జిల్లా కమిటీ సభ్యులు దాసరి సూర్యనారాయణ,పైలా అప్పలనాయుడు,ఇతర జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# గ్రామాల్లో కొనసాగుతున్న భూ భారతి సదస్సులు

**రైతులు భూ భారతి సదస్సును సద్వినియోగం చేసుకోవాలి:తాసిల్దార్ బి అశోక్**

**కొండాపూర్,మే 15 (ప్రజాక్షేత్రం):** ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపడుతున్న భూభారతి చట్టం ద్వారా రైతులు సమస్యల పరిష్కారానికి అవకాశం ఉందని సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న సమస్యలు ఆధారంగా పరిష్కరించుకోవాలని మండల తహసిల్దార్ అశోక్ మండలంలోని సైదాపూర్ మారేపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సదస్సులో వారన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి సదస్సులో సైదాపూర్ లో 148 మారేపల్లిలో 56 అర్జీలు దరఖాస్తులు వచ్చినట్లు తెలియజేశారు .ఈ సదస్సులు ఈ నెల 19 వరకు కొనసాగుతాయి అన్నారు. రైతులు వ్యక్తిగత పనుల వల్ల సదస్సులో దరఖాస్తు ఇవ్వలేకపోతే తహసిల్దార్ కార్యాలయం నందు దరఖాస్తు సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు అనంతరం రెవెన్యూ రెవెన్యూ సిబ్బంది నాయకులు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఉపతహసిల్దార్ హేమంత్ కుమార్,ఆర్ ఐ రాజు,పంచాయతీ కార్యదర్శి సంపత్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హాజీ పటేల్,వంశీ ధర్ గౌడ్,ప్రవీణ్ కుమార్,తలారి రాజు మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.





# తడిసిన ధాన్యన్ని పూర్తిస్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేయాలి

**ఎమ్మెల్యే చింత ప్రభాకర్.**

**కొండాపూర్,మే 15 (ప్రజాక్షేత్రం):** మండల పరిధిలోని కొనాపూర్ గ్రామంలో తడిసిన ధ్యాన్యాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పరిశీలించి అక్కడ రైతులతో మాట్లాడారు.ప్రభుత్వం సక్రమంగా ధాన్యం సేకరణ చేపట్టక పోవడం వల్లే రైతులు నష్టపోయారని అన్నారు. ఎద్దుఏడ్చిన వ్యవసాయం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్లు లేదు, అధికారుల నిర్లక్ష్యం సకాలంలో ధాన్యం సేకరణ చేయడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. నామమాత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని ,సెంటర్లలో కనీస సౌకర్యాలు లేవన్నారు. టార్పాలిన్లు లేక ధాన్యం తడిసిందన్నారు.తడిసిన ధాన్యన్ని పూర్తిస్థాయిలో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ధాన్యపు రాశుల చుట్టూ తిరగాల్సిన వారు అందాల రాశుల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కొండాపూర్ మండల పార్టీ అధ్యక్షులు విఠల్,కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి,సొసైటీ చైర్మన్ రాజు,పాండు,పవన్,నాగేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వలిగొండలో మజ్జిగ పంపిణీ చేసిన హెచ్ పి పెట్రోల్ బంక్ యాజమాన్యం

**వలిగొండ,మే15(ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ కేంద్రంలో హిందుస్థాన్ పెట్రోలియం హెచ్ పి యాజమాన్యం వాహనదారులకు,చల్లటి మజ్జిగ సరఫరా చేయడం పట్ల వాహనదారులు హర్ష వ్యక్తం చేశారు.హెచ్ పి యాజమాన్యం వారు ప్రజా గొంతుక ప్రతినిధితో మాట్లాడుతూ ప్రతి సంవత్సరము మే నెల ఎండకాలంలో వాహనదారులు ఇబ్బంది పడకుండా చల్లటి మజ్జిగను సరఫరా చేస్తున్నామని తెలిపారు.

# లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన కాంగ్రెస్ నాయకులు

**వలిగొండ,మే 15(ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని ,సుంకిశాల గ్రామానికి చెందిన ఏనుగు శంకర్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 24 వేల రూపాయల చెక్కును గురువారం సుంకిశాల గ్రామ శాఖ ఆధ్వర్యంలో అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి బాధితులకు ఆసరా అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ,జిల్లా నాయకులు చెరుకు శివయ్య గౌడ్,మత్స్యగిరిగుట్ట డైరెక్టర్ ఈ తాప రాములు,గ్రామ శాఖ అధ్యక్షులు పోలేపల్లి వీరస్వామి,మాజీ సర్పంచ్ మొగిలి పాక నరసింహ,వింజమూరు రమేష్,బాల కృష్ణ,బాల నరసింహ,సత్యనారాయణ గౌడ్,మల్లేష్ గౌడ్,జమ్మయ్య, ముత్యాలు,కే వెంకటేశం, దేశపా శంకరయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# వధూవరులను ఆశీర్వదించిన గుర్రం లక్ష్మారెడ్డి

**వలిగొండ,మే 15(ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని రెడ్ల రాపాక గ్రామానికి చెందిన బోనాల ముత్యాలు కుమార్తె మౌనిక వివాహము హైదరాబాదులోని మేడిపల్లి లో ఘనంగా జరిగాయి.ఈ వివాహానికి జిఎల్ఆర్ ఫౌండేషన్ అధినేత గుర్రం లక్ష్మారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.అనంతరం ఆడపిల్ల పెళ్లి కానుక ద్వారా వధువు కుటుంబానికి 10వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నోముల మల్లేష్,బత్తిని పాండు, సిరికొండ జహంగీర్,కందుల మహేష్,రేపాక శ్రీనివాసరెడ్డి,సుంకరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

- సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలి.
- రైతులు సుస్థిర ఆదాయం పొందాలి.

**మాక్లూర్,మే 15(ప్రజాక్షేత్రం):** ప్రాంతీయ చెరుకు,వరి పరిశోధన స్థానం రుద్రూర్ శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ సమన్వయంతో మాక్లూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక లో అవగాహనా కార్యక్రమం ను నిర్వహించారు. ఇందులో భాగంగా కీటక శాస్త్రవేత్త సాయి చరణ్ మాట్లాడుతూ రైతులు పంటను చీడ పీడల నుండి రక్షించడం కోసం కేవలం రసాయన మందుల్ని విచక్షణారహితంగా పిచికారి చేయకుండా సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలని సూచించారు.పొలం లో లింగాకర్షక బుట్టలను అమర్చడం,పసుపు మరియు నీలం రంగు జిగురు అట్టలు ఎకరాకు 20 చొప్పున ఉంచుకొని పురుగు యొక్క ఉధృతి ఆర్థిక పరిమిత స్థాయిని దాటినప్పుడు మాత్రమే రసాయన మందులు వినియోగించాలని, పంటలలో అవసరం మేరకు మాత్రమే నత్రజని ఎరువులను వేసుకొని పంట సాగు ఖర్చులు తగ్గించాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారిని పద్మ మాట్లాడుతూ రైతులు విత్తనం మరియు పురుగు మందులకు సంబంధించిన రసీదులను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని అదేవిధంగా పంట మార్పిడి చేసుకోవాలని తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రశాంతి మాట్లాడుతూ పంట కి సాగు నీరు అవసరం మేరకు అందించాలని,మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పి.ఎ.సి.ఎస్ చైర్మన్ బూరోళ్ల అశోక్, ఏ.ఎం.సీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు మహేందర్, పశువైద్యాధికారులు,అమూల్య, ఉమాదేవి,దివ్య,రాజు నాయక్,రైతులు తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ ఎర్నిమాంబను దర్శించుకున్న సీతంరాజు

**విశాఖపట్నం,మే 15( ప్రజాక్షేత్రం ):** జ్ఞానాపురంలోని శ్రీ ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతరోత్సవాలు మొదలైన నేపథ్యంలో గురువారం విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి,రాష్ట్ర వైద్య సేవ ట్రస్ట్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ శ్రీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డివిఎస్ సురేష్ బాబా ఇందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి సుధాకర్ కు ఘనంగా స్వాగతం పలికారు. వేదమంత్రాలతో అమ్మవారికి సుధాకర్ విశేష పూజలు నిర్వహించారు.గురువారం శ్రీ అమ్మవారికి నీలధార ఉత్సవం జరిగింది.ఈనెల 18వ తేదీ వరకు అమ్మవారి వార్షిక జాతరోత్సవాలు వైభవంగా జరుగుతాయని భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని 17,18 తేదీల్లో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని దేవస్థానం వద్ద విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు ఈఓ సురేష్ బాబా తెలిపారు.



# వైభవంగా బంగారమ్మవారి పండుగ మహోత్సవం.

- భక్తులు కోలాహలము
- ప్రత్యేక పూజలు నిర్వహించిన గంట్ల

**పెందుర్తి,మే 15(ప్రజాక్షేత్రం):** పెందుర్తి మండలం గొల్లవిల్లి వానిపాలెం పరిసర గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ బంగారమ్మ తల్లి పండుగ మహోత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించే ఈ అమ్మవారి పండగను ఈ ఏడాది కూడా సాంప్రదాయబద్ధంగా జరిపించారు.తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాతసేవ తో మేలుకొలిపి,ఆరాధన గావించారు. అనంతరం భక్తులందరికీ అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. ప్రసాదం, మజ్జిగ,మంచినీరు భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసారు.ఈ సందర్భంగా నిర్వహించిన విశేష సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులు ను విశేషంగా అలరించాయి. బంగారమ్మవారిని సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి,నావెల్



డాక్ యార్డ్ కేటీబి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో పాటు వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు.

# నా పై దాడి చేసిన పల్లా శ్రీనివాస్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి

- టిడ్కో ఇల్లు వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలి
- టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల ఈఎంఐ ప్రభుత్వ చెల్లిస్తుందని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించింది
- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్




**విశాఖపట్నం,మే 15(ప్రజాక్షేత్రం):** రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన టిడ్కో ఇల్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. లబ్ధిదారులు బ్యాంకు రుణాలకు చెందిన ఈఎంఐ కూడా ప్రభుత్వ చెల్లిస్తుందని అసెంబ్లీ సాక్షిగా బిజెపి ఫ్లోర్ లీడర్ పి.విష్ణుకుమార్ రాజు అడిగిన ప్రశ్నకు ప్రభుత్వ ప్రకటించింది.గురువారం ఆయన జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేసి అనంతరం మీడియాతో మాట్లాడారు. 2,68,000 వేల మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరు లక్ష రూపాయలు చొప్పున 2017లో టిడ్కో ఇంటి కోసం చెల్లించాలన్నారు, మిగిలిన దానికి బ్యాంకు రుణం ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఈఎంఐ తో పాటు వడ్డీతో కలిపి 5000/లబ్ధిదారులు కడుతున్నారన్నారు. దీనివల్ల 10,72,000 మంది ఇబ్బంది పడుతున్నారన్నారు.ఈ విషయమే ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అసెంబ్లీలో ప్రస్తావించినప్పుడు ఈఎంఐ ప్రభుత్వమే కట్టే విధంగా సంబంధించిన మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. నిధులన్నీ అమరావతికి మళ్ళిస్తున్నారని, ముందుగా టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని తాను డిమాండ్ చేస్తున్నా అన్నారు.టిడ్కో ఇళ్ళు ఇచ్చేవరకు తాను పోరాటం కొనసాగిస్తున్నారు. కాంటాక్ట్ లు ఎవరు టిడ్కో ఇల్లు నిర్మాణానికి ముందుకు రావట్లేదు అని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం మొదలు పెట్టింది కాబట్టి దీన్ని ఈ ప్రభుత్వమే పూర్తి చేయాలని కోరారు.ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ నా పై అరాచక శక్తితో దాడి చేయించారని , వందలాది మంది నన్ను హత్య చేసేందుకు వచ్చారని తెలిపారు. ఒక బాధ్యత గల పౌరుడిగా ఏప్రిల్ 24న ఢిల్లీలో సిబిఐకు మరియు కేంద్ర హోంమంత్రికి పల్లా శ్రీనివాస్ చేస్తున్న భూదందాలు కేంద్ర ప్రభుత్వం ఆస్తులు కబ్జాలపై ఒక నివేదిక తయారు చేసి సమర్పించడం అయినది, పల్లా శ్రీనివాస్ తనను హతమార్చడానికి ప్రయత్నం చేస్తున్నారని,హోటల్ సిసి ఫుటేజ్ పరిశీలిస్తే పూర్తి విషయాల బయటపడతాయని చెప్పారు. అదేవిధంగా స్పీకర్ దృష్టికి తీసుకెళ్లినన్నారు.ఈ దాడికి సంబంధించిన వీడియోలు విడుదల చేయాలని,పల్లపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నాను అన్నారు.తాను వ్యక్తిగతంగా పల్లా పై పోరాటం చేస్తున్నానని,ఇది టిడిపి పై పోరాటం కాదని స్పష్టం చేశారు.ఇప్పటివరకు ఉన్న బి.వి.రామ్ రాజకీయంగా చనిపోయాడని ,ఇక పై నేను ప్రజల తరపున పోరాటం చేస్తానన్నారు.రాజకీయాలను ముందుండి నడిపిస్తానని చెప్పారు.



# మళ్ళీ జగన్ ప్రభుత్వంలో యెర్నిమాంబ ఆలయాన్ని విస్తరిస్తాం

- నీల ధార యాత్రలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్
- ఆవరణంలో శాశ్వత షెడ్డు నిర్మాణం చేపట్టాలి
- 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్.

**విశాఖపట్నం,మే 15( ప్రజాక్షేత్రం )**

యెర్నిమాంబ అమ్మవారి జాతరోత్సవాల్లో జీవీఎంసీ 41 వ వార్డు జ్ఞానాపురంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ,కోడిగుడ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన నీలదార యాత్రలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొని అమ్మవారినీ దర్శించుకున్నారు.జ్ఞానపురం నుండి అమ్మవారి ఆలయం వరకు భారీగా స్థానిక మహిళలతో పసుపు నీళ్ల బిందులు పట్టుకొని జరిగిన యాత్రలో వాసుపల్లి పాల్గొని చీర, పసుపు కుంకుమ బుట్టను తలపై పట్టుకుని ఆలయానికి నడిచి వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఆయనతోపాటు వైసీపీ కార్పొరేటర్లు కోడిగుడ్ల పూర్ణిమ, తోట పద్మావతి, కోరుకొండ వెంకట స్వాతి దాస్, రెయ్యి వెంకటరమణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాసుపల్లి గణేష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఎంతగానో కృషి చేశారన్నారు. మళ్లీ ప్రజల ఆశీస్సులతో రానున్న జగన్ ప్రభుత్వంలో పంటల తల్లి, సంతాన దేవతగా ప్రసిద్ధిగాంచిన ఇక్కడి శ్రీ యెర్నిమాంబ అమ్మవారి ఆలయాన్ని మరింత విస్తరించే విధంగా కృషి చేస్తానని అమ్మవారి పాదాల సాక్షిగా వాసుపల్లి తెలిపారు. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ మాట్లాడుతూ గతంలో ఇక్కడి ఆలయాన్ని తొలగించే ప్రక్రియలో వాసుపల్లి గణేష్ కుమార్ అడ్డుకొని స్థానికంగా అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. మళ్లీ వైసిపి ప్రభుత్వం లోనే వాసుపల్లి గణేష్ కుమార్ నేతృత్వంలో భక్తులకు సౌకర్యార్థం అన్ని వసతులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రస్తుతం ఆలయ అభివృద్ధిని అడ్డుకునే కుతంత్ర రాజకీయాలు చేస్తున్నారని కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణమే స్థానిక అమ్మవారి ఆలయంలో శాశ్వత షెడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లండ రమణ, 41వ వార్డు వైసిపి నాయకులు వేలంగిని రావు ,కుమార్, మురళి,కిషోర్ అప్పారావు, పరీష్,అర్జున్,భవాని,రవి, ప్రసన్న,శ్యామ్ బాబ్జి,ప్రసాద్, గనగళ్ళ,రామరాజు, చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

# గుడ్‌న్యూస్.. రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం.. ఒకేసారి మూడు నెలల రేషన్..!!

**హైదరాబాద్ మే 15(ప్రజాక్షేత్రం):** వర్షాకాలంలో తిండి గింజల నిల్వ, రవాణాలో అంతరాయాలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. జూన్ నుంచి మొదలయ్యే వర్షాకాలం, వరదల వంటివి రాష్ట్రాలకు అడ్డంకులుగా మారవచ్చన్న అంచనాల నేపథ్యంలో, అన్ని రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలు జాతీయ ఆహార భద్రత చట్టం కింద ఆగస్టు 2025 వరకు అవసరమైన తిండి ధాన్యాలను ముందస్తుగానే లిఫ్టింగ్ చేసి, పంపిణీ చేయాలని స్పష్టం చేసింది. మూడు నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శులకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాహుల్ సింగ్ లేఖ రాశారు. మే 30లోగా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన సరకును లబ్ధిదారులకు అందించాలని పేర్కొన్నారు. ముందస్తు బియ్యం లిఫ్టింగ్, పంపిణీ ప్రక్రియలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) గోడౌన్లలో తగినంత నిల్వలు ఉండేలా చూసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించారు. ఈ ఉత్తర్వులు సంబంధిత అధికారుల అనుమతి మేరకు తక్షణం అమల్లోకి వస్తాయన్నారు.

**రాష్ట్రంలో జూన్‌లోనే 3 నెలల సరఫరా**

ఏప్రిల్ కోటా రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియ పూర్తవుతున్న నేపథ్యంలో వచ్చే జూన్‌లో మూడు నెలల కోటాను విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తెలియజేసినట్లు సమాచారం. ప్రతినెలా 1.75 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమైన నేపథ్యంలో మూడు నెలలకు సంబంధించి



సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కారణంగా గోడౌన్‌ల నుంచి సన్న బియ్యం నిల్వలను సమీకరించి వచ్చే నెలలో మూడు నెలల రేషన్ కోటాను విడుదల చేసేందుకు పౌర సరఫరాల శాఖ సన్నాహాలు చేస్తోంది.

# ఎక్స్‌పీరియం ఎకో పార్కును సందర్శించనున్న అందగెత్తెలు

**శంకర్ పల్లి మే 15(ప్రజాక్షేత్రం):**

శంకర్ పల్లి మండలం పొద్దుటూరు గ్రామ పరిధిలోని ఎక్స్‌పీరియం ఎకో పార్కును ఈనెల 16వ తేదీ శుక్రవారం సాయంత్రం 22 దేశాలకు చెందిన ప్రపంచ అందగత్తెలు సందర్శించనున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సేదదీరానున్నారు. ప్రకృతి ప్రేమికుడు రాందేవ్ రావ్ 150 ఎకరాలలో 85 దేశాల నుంచి తరలించి ఇక్కడ నాటిన చెట్లను తనివి తీరా చూసి పులకించనున్నారు. అనంతరం పార్కులోని బాంబో గార్డెన్, బుద్ధ గార్డెన్, కల్పవృక్షాలు, జపనీస్ గార్డెన్ అందాలను వారు తిలకించినున్నారు. త్రిస్టోన్ ఏరియా లో సుందరీమణులు తేనీటి విందు లో పాల్గొననున్నారు. తదనంతరం వారందరూ పార్క్ లో ఒక్కో మొక్కను నాటి రాత్రి కి హైదరాబాద్ కు తిరుగు పయనం అవ్వనున్నారు. రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్ పర్యవేక్షణలో ఏసీపీలు సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు కానిస్టేబుల్స్, మహిళా ఎస్సైలు మహిళా పోలీసులు హోంగార్డులతో బందోబస్తు నిర్వహించనున్నారు. డాగ్ స్క్వాడ్ తో పార్క్ లోని అణువణువును క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. పెద్ద ఎత్తున డోలు వాయిద్యాలతో స్వాగతం ఎక్స్పీరియన్స్ ఎకో ఫ్రెండ్లీ పార్కును సందర్శించనున్న ప్రపంచ సుందరీమణులకు పెద్ద ఎత్తున డోర్ వాయిద్యాలతో నిర్వాహకులు స్వాగతం పలకనున్నారు. పార్క్ లోని పలు వింతలు విశేషాలను గైడ్స్ వివరించనున్నారు. శుక్రవారం ప్రపంచ సుందరీమణులు సందర్శించనున్న నేపథ్యంలో రోజువారీ సాధారణ విజిటర్స్ కు అనుమతి లేదని నిర్వాహకులు తెలిపారు.




# కస్టమర్ తిన్న చికెన్ బిర్యానీలో బల్లి..

**ఇబ్రహీంపట్నం మే 15(ప్రజాక్షేత్రం):** రెస్టారెంట్ లో కస్టమర్ తిన్న చికెన్ బిర్యానీ లో బల్లి కనిపించిన ఘటన ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రం సాగర్ రోడ్డు లో ఉన్న మై ఫీల్ ఫ్యామిలీ రెస్టారెంట్ లో ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడ గ్రామానికి చెందిన గుజ్జా కృష్ణ రెడ్డి గురువారం మధ్యాహ్నం బిర్యానీ తినడానికి వెళ్లారు. కాగా ఆయన చికెన్ బిర్యానీ ఆర్డర్ చేసుకోగా వచ్చిన తర్వాత బిర్యానీ ని తినడం మొదలు పెట్టారు. బిర్యానీ లో బల్లి కనిపించడం తో ఒక్కసారిగా షాక్ కు గురైయ్యారు. తర్వాత తేరుకొని మై ఫీల్ ఫ్యామిలీ రెస్టారెంట్ యజమాని నిలదీయగా ఆయన మంచిగా ఫ్రై అయింది తిను అని చెప్పడంతో కంగుతిన్నాడు.



దీంతో బాధితుడు పోలీసులకు 100 డయల్ చేయగా వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు బిర్యానీ తిన్న బాధితుడిని టెస్టుల కోసం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రెస్టారెంట్ మేనేజర్ ను ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు తరలించారు.



# బీబీనగర్ సమీపంలో ప్యాసింజర్ రైలు కింద మంటలు

**హైదరాబాద్ మే 15(ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా లోని బీబీనగర్ సమీపంలో గురువారం ఉదయం డెమో ప్యాసింజర్ రైలు కింద స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. మిర్యాలగూడ నుండి కాచిగూడకు వెళ్తున్న రైలు బీబీనగర్ ప్రాంతానికి చేరుకునేలోగా దాని కోచ్‌లలో ఒకదాని కింద మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన ప్రయాణికులు మంటలను గమనించి వెంటనే రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. వేగంగా స్పందించి రైలును బీబీనగర్ స్టేషన్‌లో నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బందిని సంఘటనా స్థలానికి పిలిపించి, మంటలు వ్యాపించకుండా లేదా పెద్ద నష్టం వాటిల్లకుండానే ఆర్పివేయగలిగారు. ఈ సంఘటన ఫలితంగా, రైలు బీబీనగర్‌లో దాదాపు గంటసేపు అలాగే ఉండిపోయింది. భద్రతా తనిఖీలు, అగ్నిమాపక నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో గాయాలు, ప్రాణనష్టం జరిగినట్లు ఎటువంటి నివేదికలు రాలేదని, ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారు. రైల్వే అధికారులు అగ్నిప్రమాదానికి గల కారణాన్ని పరిశీలిస్తున్నారు. ప్రయాణీకుల భద్రత వారి ప్రధాన ప్రాధాన్యతగా ఉందని హామీ ఇచ్చారు. సంఘటన అదుపులోకి వచ్చిన తర్వాత సాధారణ రైలు కార్యకలాపాలు తిరిగి ప్రారంభమయ్యాయి.


# కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్ మే 15(ప్రజాక్షేత్రం):** భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారికంగా ప్రారంభించారు. త్రివేణి సంగమంలో మధనానంద సరస్వతి స్వామి తొలి స్నానం ఆచరించారు. సరస్వతి పుష్కరిని వద్ద మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక పూజలు చేశారు. పుణ్య స్నానాల కోసం భక్తులు భారీగా కాళేశ్వరానికి చేరుకున్నారు. నేటి నుంచి ఈ నెల 26వ తేదీ వరకు సరస్వతి నది పుష్కరాలు కొనసాగనున్నాయి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సరస్వతి పుష్కరాలు తొలిసారి జరుగుతున్నాయి. సరస్వతి పుష్కరాల కోసం రూ. 35 కోట్లతో శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. కాళేశ్వరంలో 17 అడుగుల సరస్వతి విగ్రహం ఏర్పాటుకు నిర్ణయించారు. 12 రోజుల పాటు త్రివేణి సంగమంలో కాశీ పండితులతో గోదావరికి హారతి ఇవ్వనున్నారు. రోజూ ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యాగాలు చేయనున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6.45 నుంచి 7.35 వరకు సరస్వతి నవరత్న మాల హారతి ఇవ్వనున్నారు. ప్రతిరోజూ రాత్రి కళ, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన చేపట్టనున్నారు. సరస్వతి పుష్కరాలకు 3500 మంది పోలీసులతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.



# పోలీసులు అదుపులో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్


**హైదరాబాద్ మే 15(ప్రజాక్షేత్రం):** టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ను జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండ్రోజుల క్రితం ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడమే కాకుండా.. పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. దీంతో తాజాగా ఆయనపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి.. గురువారం అరెస్ట్ చేశారు. మరోవైపు హీరో సాయిపై నెటిజన్లు కూడా ఫైర్ అవుతున్నారు. ఎంత సినిమా హీరో అయితే మాత్రం రోడ్డుపై ఇష్టమొచ్చినట్లు కారు నడపొచ్చా అంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. కాగా, 'అల్లుడి శీను'తో బెల్లంకొండ శ్రీనివాస్ టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చాడు. ఆ తర్వాత కవచం, రాక్షసుడు, జయ జానకీ నాయకా, సాక్ష్యం.. వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇదే ఊపులో హిందీ 'ఛత్రపతి' సినిమాను రీమేక్ చేశాడు. అది కాస్త డిజాస్టర్ కావడంతో సైలెంట్ అయిపోయాడు. ప్రస్తుతం భైరవం అనే మల్టీ స్టారర్ చిత్రంలో నటిస్తున్నాడు. ఈ సినిమాలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో పాటు మంచు మనోజ్, నారా రోహిత్‌లు కూడా నటిస్తున్నారు.



# నాంపల్లిలో రౌడీ షీటర్ దారుణ హత్య

**నాంపల్లి మే 15(ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ నాంపల్లిలోని ఎంఎన్ జే క్యాన్సర్ హాస్పిటల్ సమీపంలో అయాన్ అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. అయాన్ చంద్రాయణగుట్టకు చెందినవాడు. ఒక కేసు కోసం నాంపల్లి కోర్టుకు వెళ్ళాడు. కోర్టు తర్వాత, అతను నీలోఫర్ కేఫ్‌లో టీ తాగడానికి వెళ్ళాడు. అక్కడ, ముగ్గురు వ్యక్తులు అతనిపై దాడి చేశారు. వారు మొదట అతనిని క్రికెట్ బ్యాట్‌తో కొట్టి, తరువాత అతని గొంతు కోసి, కడుపులో పొడిచారు. దాడి తర్వాత, వారు ఆయుధాలను వదిలి పారిపోయారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి, ఆధారాలు సేకరించి, దర్యాప్తు ప్రారంభించారు. పాత తగాదాలు లేదా సమస్యల కారణంగా హత్య జరిగిందని వారు



భావిస్తున్నారు. హంతకులను కనుగొనడానికి పోలీసులు సీసీటీవీ కెమెరాలను తనిఖీ చేస్తున్నారు. అయాన్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి పంపారు.



## దళితులతో మాట్లాడడం రాజ్యాంగ విరుద్ధమా?

**మల్లికార్జున ఖర్గే**

**నేషనల్ బ్యూరో మే 15(ప్రజాక్షేత్రం):** లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ బీహార్‌లో దర్భాంగాలోని అంబేద్కర్ హాస్టల్‌కి వెళుతుండగా పోలీసులు అడ్డుకోవడంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నితీష్‌కుమార్ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. బీహార్‌లో జెడియు - బిజెపి ప్రభుత్వం శిక్ష న్యారు సంవాధ్ కార్యక్రమానికి హాజరుకాకుండా ప్రయత్నించిందని ఆయన అన్నారు. రాహుల్ దళిత, అణగారిన వెనుకబడిన వర్గాల తరగతుల విద్యార్థులతో మాట్లాడడం రాజ్యాంగ విరుద్ధమా? వారి విద్య, నియామక పరీక్షలు, ఉద్యోగాల గురించి వారితో మాట్లాడడం తప్పా? రాహుల్‌ని శిక్ష న్యారు సంవాద్ కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకోవడం జెడియు బిజెపి ప్రభుత్వం యొక్క నియంతృత్వానికి పరాకాష్ట. ప్రజాస్వామానికి పుట్టినిల్లు అయిన బీహార్ ఈ అన్యాయాన్ని గుర్తుంచుకుంటుంది. సమయం వచ్చినప్పుడు జెడియు బిజెపికి తగిన సమాధానం ఇస్తుంది అని ఖర్గే ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, గురువారం దర్భాంగాలో జరిగిన ఒక సభలో రాహుల్ గాంధీ బీహార్‌లో జెడియుబిజెపి ప్రభుత్వాన్ని డబుల్ ఇంజిన్.. దోకేబాజ్ సర్కార్‌గా అభివర్ణించారు. అంబేద్కర్ హాస్టల్‌కి వెళ్లాలన్నా.. పోలీసులు అడ్డుకున్నారని, కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, మైనార్టీలకు వ్యతిరేకమని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# వీర వనితలు పుట్టిన నేలపై తెలంగాణ ఆడబిడ్డలకు ఘోర అవమానం : ఎమ్మెల్యే సబిత

**హైదరాబాద్ మే 15(ప్రజాక్షేత్రం):** రుద్రమదేవి, సమ్మక్క సారాలక్క లాంటి వీర వనితలు పుట్టిన నేలపై తెలంగాణ ఆడబిడ్డలకు ఘోర అవమానం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందాల పోటీలకు వచ్చిన యువతుల కాళ్లను వరంగల్ మహిళలతో రాష్ట్ర ప్రభుత్వం కడిగించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై సబితా ఇంద్రారెడ్డి సీరియస్‌గా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆడబిడ్డల పరువు తీసింది. తెలంగాణ రాష్ట్రమే కాదు, భారత దేశ మహిళల పరువును ప్రపంచం ముందు తీసిన సంఘటన ఇది. వీర వీరవనితలు రాణి రుద్రమదేవి, సమ్మక్క - సారలమ్మలు పుట్టిన నేలపైనే ఈ ఘోర అవమానం జరగడం చాలా బాధాకరం. తెలంగాణ ఆడబిడ్డలతో మిస్ వరల్డ్ పోటీదారుల కాళ్లు కడిగించడం, తుడిపించడం దుర్మార్గమైన,అవమానకరమైన,అత్యంత హీనమైన చర్య..యావత్ మహిళ లోకానికి ఈ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి అని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని, తమ కాళ్ళ మీద తాము నిలబడేలా చేసి మహిళల ఆత్మ గౌరవాన్ని పెంచుతామని గొప్పగా చెప్పే ప్రభుత్వం విదేశీయుల కాళ్ళు కడిగించటం ద్వారా ఏ సంకేతాలు ఇస్తున్నారు. ఒకవైపు రాష్ట్రంలోని మహిళలు తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం నడుస్తుంటే, మరోవైపు విదేశీ అందగత్తెలకు తమ కాళ్లు కడిగి, టవల్‌తో తుడిపించడం దేనికి సంకేతం ఇస్తుంది అని ఆమె ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మిషన్ భగీరథతో మహిళల నీటి కష్టాలు తీరిస్తే, నేడు బిందెలా కష్టాలు తెచ్చి పాత రోజులు తెచ్చిన



ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుంది. కానీ ఆడబిడ్డల గౌరవాన్ని తగ్గించిన ఏ ఒక్కరు కూడా బాగుపడినట్టు చరిత్రలో లేదు. అదేవిధంగా మహిళల ఉసురు తగిలి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా పతనం అవ్వటం ఖాయం అని ఎమ్మెల్యే సబిత హెచ్చరించారు.




## ఈడీ సోదాలు.. వైఎస్ రెడ్డి ఇంట్లో భారీగా డబ్బు, బంగారం స్వాధీనం

**హైదరాబాద్ మే 15(ప్రజాక్షేత్రం):** హైదరాబాద్‌లో మరోసారి ఈడీ సోదాలు కలకలం సృష్టించాయి. ముంబయి వసాయి విరార్ మున్సిపల్ కార్పోరేషన్ స్కామ్‌లో భాగంగా ఈడీ అధికారులు.. ముంబై, హైదరాబాద్‌తో పాటు 12 ప్రాంతాల్లో గురువారం సోదాలు నిర్వహించారు. ముంబైలో టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వైఎస్ రెడ్డి నివాసంలో ఈడీ అధికారులు తనిఖీలు చేసి.. భారీగా నగదును గుర్తించినట్లు సమాచారం. మొత్తం రూ.9 కోట్లకు పైగా నగదుతో పాటు రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మల్టీ జోన్ 1 పరిధిలో తాహాసిల్దార్ ల బదిలీలు

హైదరాబాద్ మే 15(ప్రజాక్షేత్రం): మల్టీ జోన్ 1 పరిధిలో తాహాసిల్దార్ లను బదిలీ చేస్తూ సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. మల్టీ జోన్ 1 పరిధిలో 55 మంది తహాసీల్దారులను బదిలీ చేస్తూ వారి వివరాలను ఉత్తర్వులో పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, మంచిర్యాల్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, సిద్దిపేట్, హనుమకొండ, కొమురం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, పెద్దపల్లి, వరంగల్, కామారెడ్డి జిల్లాలలోని తాహాసిల్దారులను బదిలీ చేస్తూ ఆయా జిల్లా ల కలెక్టర్లకు ఈ ఉత్తర్వులను అందజేశారు.




## యాదగిరిగుట్టలో బస్సు కోసం భక్తుల కుమ్ములాట..

**యాదగిరి మే 15(ప్రజాక్షేత్రం):** ప్రసిద్ధ యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం వద్ద బస్సు కోసం భక్తులు కుమ్ములాటకు దిగారు. కొండపై దేవస్థానం బస్టాండ్ ఆవరణలో బస్ ఎక్కే సమయంలో భక్తులు కొట్టుకున్నారు. ఈ ఘటనలో పలువురు భక్తులకు గాయాలైనట్లు సమాచారం. యాదగిరిగుట్ట బస్టాండ్ నుంచి ఆలయం వరకు, ఆలయం నుంచి గుట్ట బస్ స్టాండ్ వరకు ఆర్టీసీ ఉచితంగా యాదాద్రి దర్శిని పేరుతో మినీ బస్సులను నడుపుతోంది. ఈ క్రమంలో ఓ బస్సు ఇవాళ గుట్టపైన బస్టాండ్ లోకి రాగానే ఎక్కేందుకు భక్తులు ఒక్కసారిగా ఎగబడ్డారు. ఈ క్రమంలో పరస్పరం తోపులాట జరిగింది. దీంతో కోపోద్రిక్తులైన భక్తులు పరస్పరం తోసుకుంటూ కొట్టుకున్నారు. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ గా మారింది.





## విషాదం.. ఆరు రోజుల్లో కూతురు పెళ్లి.. అంతలోనే తండ్రి హఠాన్మరణం

**మెదక్ మే 15(ప్రజాక్షేత్రం):** పెళ్లి బాజాలు మోగాల్సిన చోట, చావు డప్పు మోగిన విషాదకర ఘటన మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం బహిరన్‌దిబ్బలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే బహిరన్‌దిబ్బ గ్రామానికి చెందిన నడిమింటి నాగయ్య(50) పెద్ద కూతురు తేజ వివాహం ఈనెల 21న జరగాల్సి ఉంది. అందుకు నాగయ్య అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాడు. ఇంతలోనే గురువారం ఉదయం హార్ట్ ఎటాక్‌తో మృతి చెందాడు. దీంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. మృతుడి చిన్న కూతురు అశ్విని తండ్రికి తలకొరివి పెట్టింది. ఈ ఘటనతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అంత్యక్రియల్లో రాష్ట్ర జడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు కాదిరాబాద్ రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## తెలంగాణలో మరో కొత్త పథకం.. వృద్ధులకు ప్రభుత్వం గుడ్ న్యూస్..!

**తెలంగాణ బ్యూరో మే 15(ప్రజాక్షేత్రం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త పథకాన్ని అమలు చేయనుంది. రాష్ట్రంలోని వృద్ధుల సంక్షేమం కోసం పథకాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ప్లాన్ చేస్తుంది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో వృద్ధుల కోసం డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ పథకం దేశంలోనే మొట్టమొదటిసారిగా వృద్ధుల సంరక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన కార్యక్రమంగా పరిగణించబడుతోంది. ముఖ్యంగా ఒంటరితనంతో బాధపడే వృద్ధులు సమాజంలో గౌరవంగా జీవించేందుకు ఈ డే కేర్ సెంటర్లు ఒక వేదికగా ఉపయోగపడనున్నాయి. ఈ కేంద్రాల్లో వృద్ధుల కాలక్షేపం కోసం వినోద కార్యక్రమాలు, సామాజిక కార్యకలాపాలు, వైద్య సంరక్షణ, మానసిక మద్దతు వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఈ చర్య ద్వారా వృద్ధులు సమాజంతో సంబంధాన్ని కొనసాగించడంతో పాటు, వారి ఆరోగ్యం మరియు శ్రేయస్సు కూడా మెరుగుపడనుంది. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే వృద్ధుల కోసం అనేక పథకాలను అమలు చేస్తోంది. వీటిలో ఆసరా పెన్షన్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రాయితీ ఛార్జీలు, ప్రత్యేక వైద్య సేవలు ఉన్నాయి. ఈ కొత్త డే కేర్ సెంటర్ల ఏర్పాటు ఈ సేవలను మరింత బలోపేతం చేస్తుంది. ఈ కేంద్రాలు వృద్ధులకు రోజువారీ సంరక్షణను అందించడమే కాకుండా, వారి కుటుంబ సభ్యులకు కూడా వృద్ధుల సంరక్షణ బాధ్యత నుండి కొంత ఉపశమనం కల్పిస్తాయి. ఈ డే కేర్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన వివరాలు, బడ్జెట్ కేటాయింపులు, అమలు తేదీలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది.





## ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు

**చేర్యాలమే 15(ప్రజాక్షేత్రం** తెలంగాణ రాష్ట్రంలో నిరుపేద ప్రజల కళా నెరవేరుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు ప్రతి నిరుపేద వారికి చేరాలని ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించడం జరిగిందని జనగామ డి సి సి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బచ్చన్నపేట మండలంలో బి ఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ఏ ఒక్కరికి ఇండ్లు ఇచ్చిన దాఖలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన 16 నెలల్లోనే ఇందిరమ్మ ఇండ్ల ను ఇస్తూ నిరపేద ప్రజల కలను నెరవేరుస్తుందని అన్నారు. ఇదే ఆసరాగా చూసుకొని ఎవరైనా ఇండ్లు ఇప్పిస్తామని నిరుపేద ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం తో పాటు, పార్టీ నుండి సస్పెండ్ చేయడం తో పాటు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించడం జరుగుతుందని హెచ్చరించారు. అసలైన లబ్ధిదారులకు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ప్రభుత్వం కలిసి సర్వే నిర్వహించి ఇండ్లు ఇవ్వడం జరుగుతుందని, ఎవరైనా ఎక్కడైనా డబ్బులు వసూలు చేసినట్టుగా తెలిస్తే జనగామ జిల్లా డిసిసి ఆఫీసుకు కంప్లీట్ చేయవలసిందిగా కోరారు.

**డిసిసి కార్యాలయం జనగామ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి**

## శంషాబాద్ విమానాశ్రయంలో నకిలీ పాస్‌పోర్ట్,వీసాల ముఠా గుట్టురట్టు

**శంషాబాద్ మే 15(ప్రజాక్షేత్రం):** నకిలీ పాస్పోర్ట్ మీసాలతో విదేశాలకు పంపుతున్న ముఠా గుట్టును రట్టు చేశారు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ పోస్ట్ పోలీసులు. శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నకిలీ పాస్‌పోర్ట్, వీసాలతో 8 మంది వ్యక్తులను శంషాబాద్ విమానాశ్రయం నుంచి విదేశాలకు వెళ్తున్నారన్న పక్కా సమాచారంతో లాండ్ ఆర్డర్ పోలీసులు, ఎస్వోటీ పోలీసులు ముక్కుమ్మడిగా దాడులు నిర్వహించి ముఠాలోని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సత్యనారాయణ చిలుకూరి బాలరాజు, అన్నమయ్య జిల్లాకు చెందిన సుంకర శివకుమార్ కడప జిల్లాకు చెందిన గోపాల్, హైదరాబాద్కు చెందిన అంజి ఈ ఐదుగురు ముఠాగా ఏర్పడి అమాయక ప్రజల లక్ష్యంగా ఇతర దేశాల్లో జాబ్ చేస్తే డబ్బులు ఎక్కువ వస్తాయని నమ్మించి.. నకిలీ వీసాలు తయారు చేసి వారి వద్ద లక్షల్లో వసూలు చేసి విదేశాలకు పంపుతుంటారన్నారు. బుధవారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి 8 మందిని మస్కట్ పంపిస్తుండగా దాడులు నిర్వహించి నకిలీ వీసా ముఠాలోని ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన చెరుకూరి బాలరాజు, అన్నమయ్య జిల్లాకు చెందిన సుంకర శివకుమార్ లను అరెస్ట్ చేయడం జరిగింది. ఈ కేసులో ఉన్న మరో ముగ్గురు నిందితులు సత్యనారాయణ, అంజి, గోపాల్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ ముఠా వద్ద నుండి 14 పాస్‌పోర్టులు, 14 వీసాలు, 7 సెల్ ఫోన్లు,16 విమాన టికెట్లు, రెండు స్టాంపులు,1 ల్యాప్టాప్ స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించామన్నారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితుల కోసం ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి గాలింపు ముమ్మరం చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ఔట్ పోస్టు సీఐ బాలరాజు, ఎస్ఐ సిద్దేశ్వర, ఎస్ఐ, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



## మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బిజెపి నాయకులు

**గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి మే 15(ప్రజాక్షేత్రం**

గజ్వేల్ మార్కెట్ యార్డ్ లో కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎత్తుచూపుతూ మార్కెట్ సెక్రటరీకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. గజ్వేల్ పట్టణ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్, సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి మర్కంటి ఏగొండలు మాట్లాడుతూ.. గత మూడు రోజుల నుండి వాతావరణ శాఖ భారీ వర్షాలు ఉన్నాయని సూచనలు మార్కెట్ యార్డ్ పాలకవర్గానికి, రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసినప్పటికీ నుండి కూడా ఎలాంటి ముందస్తుగా రైతుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమైన గజ్వేల్ మార్కెట్ యార్డ్ యాజమాన్యం అని చెప్పారు. మార్కెట్ యార్డులో జల్లి మిషన్లు నాలుగు ఉంటే రెండు మాత్రమే నడుస్తున్నాయి మిగతా రెండు బ్రేక్ డౌన్ లో ఉన్నాయి ఆ రెండింటి కూడా ఎలక్ట్రికల్ ఫ్లక్స్ చెడిపోవడం వల్ల రైతులు జల్లి పట్టడంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులకు గన్ని బ్యాగు అందించడంలో ట్రక్ షీట్స్ రైతులకు కల్పించాల్సిన ఫెసిలిటీ కూడా నామ మాత్రంగానే ఉన్నాయి మార్కెట్ యార్డ్ లో ధాన్యం త్వరితగతిన షిప్పింగ్ చేసి రైతుల వద్ద కల్లాలలో ఉన్నటువంటి ధాన్యాన్ని మార్కెట్ యార్డ్ కి వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతుల పక్షాన మేము డిమాండ్ చేశారు. గురువారం ఉదయం ఐదు గంటలకు భారీ వర్షం కారణంగా రైతుల ధాన్యం తడిసి ముద్దయింది తడిసిన ధాన్యాన్ని కూడా ఆంక్షలు లేకుండా మొత్తం కొనుగోలు చేయాలని అదేవిధంగా రైతుకు క్వింటాలకు 500 బోనస్ గా చెల్లించాలని తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ సి మోర్చా జిల్లా అధ్యక్షులు నత్తి శివకుమార్,సిద్దిపేట జిల్లా కౌన్సిల్ మెంబర్ చెప్యాలా వెంకట్ రెడ్డి ,ఓబిసి మోర్చ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు పెండ్యాల శ్రీనివాస్, గజ్వేల్ పట్టణ మండల ఉపాధ్యక్షులు నాయనీ సందీప్, మగ్ధూరి నరసింహ, మైసా విజయ్, బార్ అరవింద్, పట్టణ కార్యదర్శి కొనే రాజశేఖర్ రెడ్డి, ముదిరాజ్ నాగు, గజ్వేల్ పట్టణ కోశాధికారి హరి రామ్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు కుంకుమ రాణి, భక్త మాల స్వరాజ్యలక్ష్మి, ఓబిసి మోర్చా గజ్వేల్ పట్టణ అధ్యక్షులు, దువ్వల రాజు, కార్యదర్శి కేశ బోయిన రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఆడబిడ్డలకు ఘోర అవమానం

- తెలంగాణ మహిళలతో కాళ్లు కడిగిస్తారా
- బిజెపి మహిళ మోర్చా జిల్లా కార్యదర్శి కావ్య కృష్ణ గౌడ్ ధ్వజం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 16(ప్రజాక్షేత్రం):**వీరవనితలు పుట్టిన నేలపై తెలంగాణ ఆడబిడ్డలకు ఘోర అవమానం జరిగిందని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గౌండ్ల కావ్య కృష్ణ గౌడ్ అగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వారు ప్రజాక్షేత్రం విలేకరితో మాట్లాడుతూ అందాల పోటీలకు వచ్చిన యూతుల కాళ్ళను మహిళలతో రాష్ట్ర ప్రభుత్వం కడిగించడం సరికాదన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మ అభిమానాన్ని అందాల పోటీకి వచ్చిన సుందరి మనుల, పాదాల దగ్గర పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం విహరించ దాన్ని వారు తీవ్రంగా ఖండించారు. రుమాలతో తుడిపించడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు, తెలంగాణ ఆడబిడ్డలతో బిస్ వరల్డ్ పోటీదారుల కాలు కడిపించడం, తూడిపించడం, అత్యంత దుర్మార్గమైన చర్య అని, తెలంగాణ గర్వించే సమ్మక్క, సారక్క, పుట్టిన ప్రాంతంలో ఇలాంటి అవమానం బాధాకరమన్నారు. యావత్ మహిళాలోకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని తీవ్రంగా ఖండించారు విదేశీ అందగత్తెనకు తమ కాలు కడిగి రుమాలతో తుడిపించడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు, ఈ చర్య మహిళల కె, కాదు తెలంగాణ సమాజానికి జరిగిన అవమానం అన్నారు తెలంగాణ ఆడబిడ్డలతో మిస్ వరల్డ్ పోటీ దారుల కాలు కడిగించడం చుడిపించడం అత్యంత దుర్మార్గమైన చర్యాని తెలంగాణ గర్వించే సమ్మక్క సారక్క పుట్టిన ప్రాంతంలో ఇలాంటి అవమానం బాధాకరమన్నారు యావత్ మహిళా లోకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, రేవంత్ రెడ్డి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ వనితల సత్తా చూపిస్తామని హెచ్చరించారు.



# మే 20న దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయండి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 15(ప్రజాక్షేత్రం):**రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్, ఒలక్రో బస్సుల కంపెనీ కార్మికులకు మే 20న, దేశవ్యాప్త సమ్మె పోస్టర్ విడుదల చేశారు, ఈ కార్యక్రమంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి, అల్లి దేవేందర్, షాబాద్ మండల కన్వీనర్ నరసింహ, ఎలక్ట్రో బస్ కంపెనీ కార్మికులు తదితరులు ఈ కార్యక్రమం పాల్గొన్నారు.

# ప్రభుత్వ అసుపత్రిలో అడ్మిట్.. సొంత ఫ్యాన్ తెచ్చుకోవాల్సిందే..

**మహబూబాబాద్ మే 15(ప్రజాక్షేత్రం):** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కొరకు అడ్మిట్ అవ్వాలనుకున్నవారు. దయచేసి మీ వెంట ఫ్యాన్ తీసుకువెళ్లండి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ఫ్యాన్లు నిదానంగా తిరుగుతుండడంతో , ప్రభుత్వ ఆసుపత్రిలో ఫ్యాన్లు ఉన్నను డమ్మీ ఫ్యాన్లుగా ఆసుపత్రికి వైద్యం నిమిత్తం వచ్చిన ప్రజలు (పేషెంట్స్) ఇంటి వద్ద నుండి ఫ్యాన్లు తీసుకుని వచ్చి ఎవరి బెడ్డు వద్ద వారు సొంతంగా ఫ్యాన్ ని ఏర్పాటు చేసుకోవడం జరుగుతుంది..ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం నిమిత్తం వెళ్లాలనుకుంటే దోమల బెడద తోపాటు, ఎండాకాలం సరిపడ గాలి కూడా అందడం లేదు.. వైద్యం కొరకు పిల్లలకు జన్మనిచ్చిన తల్లి సంతానం ఆసుపత్రి నందు ప్రసవించి సరైన వసతులు లేకుండా ఇబ్బందులకు సామాన్య ప్రజలు గురవుతున్నారు. ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ వైద్యులు గమనించి సామాన్య ప్రజలకు అన్ని సౌకర్యాలు ఉండేటట్టు చూడాలి.



## రైతుల ధర్నా.. కాంగ్రెస్ నాయకుడిని చితకబాదిన రైతులు..

**పెద్దపల్లి మే 15(ప్రజాక్షేత్రం):** పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి ఐకెపి సెంటర్లో సన్న వడ్లు సరైన ధరకు కొనడం లేదని రైతులు రాస్తారోకో చేశారు. ఆ సమయంలో పెద్దపల్లి వైపు వెళ్తున్న కాంగ్రెస్ నేత అట్ల కుమార్, దేవునిపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఛైర్మన్ రైతులను దూషిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఇది చూసి ఆగ్రహించిన రైతులు ఆయనపై దాడి చేశారు. ఈ ఘటన సమాచారం అందుకున్న పెద్దపల్లి పోలీసులు తరలివచ్చి పరిస్థితిని నియంత్రించి ట్రాఫిక్ సజావుగా సాగించేలా చేశారు.







# రూ. 2.5 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా..!

- షాద్ నగర్ న్యూ రాఘవేంద్ర కాలనీలో పట్టపగలే "విచిత్రం"
- 20 ఫీట్ల రోడ్డును కబ్జా చేసి దర్జాగా ప్లాటు చేసుకున్న ఘనుడు
- ఇదేమని ప్రశ్నిస్తే ఎస్టి అట్రాసిటీ కేసు పెడతానంటూ బెదిరింపులు
- షాద్ నగర్ కమిషనర్ కు కాలనీవాసుల ఫిర్యాదు
- ఇంకా చర్యలు చేపట్టని మున్సిపల్ శాఖ
- వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి నిశ్శబ్దం
- ప్రభుత్వ స్థలాలు రోడ్లను ఆక్రమిస్తే చర్యలు లేవా..?



**షాద్ నగర్ మే 15(ప్రజాక్షేత్రం):**ఈ సమాజంలో పుణ్యానికి వస్తుంది అంటే స్మశానాలను, రోడ్లను, పార్కు స్థలాలను ఇతర ప్రభుత్వ భూములను సైతం వదలని ఘనులు ఉన్నారు. బహిరంగ మార్కెట్లో లక్ష రూపాయలకు చదరపు గజం విలువైన రోడ్డు స్థలాన్ని ఓ ప్రబుద్ధుడు ఏకంగా కబ్జా చేసి కాంపౌండ్ వాల్ నిర్మించాడు. ఇదేమని ప్రశ్నిస్తున్న స్థానిక వాసులను ఎస్టి అట్రాసిటీ కేసు పెడతానంటూ బెదిరిస్తున్నాడని జనాలు వాపోతున్నారు. షాద్ నగర్ మున్సిపాలిటీకి లిఖితపూర్వక ఫిర్యాదు అందినప్పటికీ అధికారులు సైతం ఎందుకు చోద్యం చూస్తున్నారు అర్థం కాని విషయం. దీని వెనుక ఎవరు ఉన్నారు? ఎక్కడి ధైర్యం మున్సిపల్ అధికారులే చెప్పాలి. సుమారు పాత జాతీయ రహదారి కి అనుకొని ఉన్న ఈ రోడ్డు స్థలం విలువ రెండున్నర కోట్ల పైమాటే అని స్థానికులు అంటున్నారు.

**వివరాల్లోకి వెళితే..**

షాద్ నగర్ పట్టణంలోని సర్వే నెంబర్ 206పి, 207పి లో 1993లో గ్రామపంచాయతీ లేఔట్ కింద ఇండ్ల స్థలాలు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్లను వదిలి స్థలాలను చేశారు. మొత్తం 169 ప్లాట్లను అప్పట్లో ఏర్పాటు చేశారు. చాలామంది ఇండ్ల స్థలాలను కొనుక్కొని నీళ్లను నిర్మించుతున్నారు. ఇదే క్రమంలో నేషనల్ మార్ట్ కొంత సమీపంలో ఎదురుగా న్యూ రాఘవేంద్ర కాలనీ ఎంట్రెన్స్ పాత జాతీయ రహదారి మర్యారాణి కమాన్ పక్కనే 20 ఫీట్ల రోడ్డు ఈ కాలానికి వర్తిస్తుంది. ఎవరు చూడరు ఏమీ చేయలేరు అన్న ధీమా ఏమిటో కానీ ఓ ప్రబుద్ధుడు ఏకంగా 20 ఫీట్ల రోడ్డును కబ్జా చేసి కాంపౌండ్ వాల్ వేశాడు.

**మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు..**

షాద్ నగర్ మున్సిపల్ కమిషనర్ సునీతకు తేదీ 6న ఫిబ్రవరి 2025లో ఈ వ్యవహారంపై లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. 20 ఫీట్ల ప్రభుత్వ రోడ్డు కబ్జాకు గురైందని ఓ వ్యక్తి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలని ప్రజలకు ఉపయోగకరమైన రోడ్డును ఎలా కబ్జా చేస్తారని దీనిపై చర్యలు చేపట్టాలని కాలనీవాసులు ప్రస్తుత మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, ప్రభాకర్, కిరణ్, శివ, రాజు, వినయ్ తదితరులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ ప్రాథమిక విచారణకు ఆదేశించారు. స్థానిక లేఅవుట్ అధికారి ఇక్కడికి వచ్చి స్థలాన్ని పరిశీలించారు. అధికారులు వాస్తవాలను గమనించి నిర్మాణాలు చేపట్టకూడదని ప్రస్తుతం చేసిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ ఆదేశాలు బేఖాతర్ అయ్యాయి. మున్సిపల్ శాఖ కమిషనర్ తదితరు అధికారులు నిబంధనల ప్రకారం వారిపై చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ఈ కబ్జాలు తొలగలేదు. 20 ఫీట్ల రోడ్డు నేషనల్ మార్ట్ ముందు పాత జాతీయ రహదారిని ఆనుకొని పొడవుగా వెళుతుంది. మధ్యలో అడ్డగూడ నిర్మించి కాంపౌండ్ వాల్ వేసుకున్నారు. గతంలో ఈ అక్రమ నిర్మాణాలపై స్థానికులు ప్రశ్నిస్తే సదరు వ్యక్తి ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని వారిని బెదిరిస్తున్నట్లు చెబుతున్నారు. పట్టపగలే ఈ చిత్ర విచిత్ర విన్యాసాలను కలపగించి చూస్తున్న మున్సిపల్ శాఖ అధికారులు ఎందుకు కబ్జాలను తొలగించడం లేదన్నది ప్రశ్న. ఇది ఇలాగే కొనసాగితే షాద్ నగర్ పట్టణంలో ఇక రోడ్డులు పార్కులు తదితర ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసేందుకు అక్రమార్కులు సిద్ధంగా ఉంటారు.



**ఫిర్యాదు ఇచ్చారు నిజమే..**

ఈ వ్యవహారమై స్థానికులు మున్సిపల్ శాఖకు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని కమిషనర్ సునీత మీడియాకు వివరణ ఇచ్చారు. లిఖితపూర్వక ఫిర్యాదులు కొన్ని విషయాలను పేర్కొన్నారని దానిపై టౌన్ ప్లానింగ్ అధికారి విచారణ జరిపారని చర్యలు చేపడతామని హెచ్చరించారు.

**ఎవరి ధైర్యం చూసుకుని..?**

రోడ్డును దర్జాగా కబ్జా చేసిన సదరు వ్యక్తి ఎవరి ధైర్యం చూసుకొని ఈ అక్రమానికి పాల్పడ్డాడు సాక్షాత్తు మున్సిపల్ శాఖ అధికారులకు తెలియాలి అని స్థానికులు వాపోతున్నారు. ఇంత దౌర్జన్యంగా అన్యాయంగా పట్టపగలే స్థలాలు కబ్జా చేస్తే ఇక ప్రభుత్వం ఉన్నది ఎందుకని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. లిఖితపూర్వక ఫిర్యాదు చేసి వాస్తవాలను చూపించిన మున్సిపల్ శాఖ ముందుకు కదలకపోవడం వెనక ఎవరున్నారని జనాలు నిలదీస్తున్నారు.



## 'కింగ్‌డమ్' న్యూ రిలీజ్ డేట్ ఫిక్స్

రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ హీరోగా దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ డ్రామా మూవీ కింగ్‌డమ్. ఈ మూవీ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో సినిమాకు సంబంధించి మేకర్స్ కీలక అప్‌డేట్‌ని అందించారు. ఈ మూవీ రిలీజ్‌ని వాయిదా వేస్తున్నట్లు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారం ఈ సినిమా మే 30న విడుదల కావాల్సింది. కానీ జులై 4న విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ వెల్లడించింది. కింగ్‌డమ్ మూవీని మే 30న విడుదల చేయాలని ఎంతో ప్రయత్నించామని.. కానీ, ఇటీవల దేశంలో ఊహించని ఘటనలు జరిగాయని చెప్పారు. దేశంలోని వాతావరణం కారణంగా, ప్రమోషన్‌లు కష్టంగా మారాయని.. ఈవెంట్స్ నిర్వహించడం సరికాదని వాయిదా వేసినట్లు చెప్పారు. జులై 4న మూవీని విడుదల చేస్తామని సితార ఎంటర్‌టైన్‌మెంట్ ప్రకటించింది. మూవీ ఆలస్యంగా వచ్చినా అభిమానుల ప్రేక్షకుల అంచనాలకు తగ్గకుండా ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే విడుదలైన మూవీ స్పెషల్ వీడియోకు మంచి స్పందన వచ్చింది. దాంతో ప్రేక్షకులలో మూవీనిపై భారీ అంచనాలు పెరిగాయి.






## నేనే ధైర్యంగా బయటపెట్టా

ప్రముఖ మోడల్, నటి సోనాలి బింద్రే. తెలుగు, తమిళం, కన్నడ సినిమాల్లో నటించి వేలాది అభిమానులను సొంతం చేసుకుంది. ఆమెకు బాలీవుడ్ నటిగానే ఎక్కువగా గుర్తింపు లభించింది. ఎందుకంటే ఎక్కువ సినిమాలు హిందీలోనే చేసింది. ఇక మన తెలుగులో అగ్ర హీరోల సరసన నటించి మంచి హిట్‌లతో ప్రేక్షకుల మన్ననలను అందుకుంది. అంతేకాదు సోనాలి అత్యంత అందమైన నటిగా కూడా గుర్తింపు తెచ్చుకుంది. అదీగాక చూడటానికి కుందనపు బొమ్మల ఆకర్షణీయంగా ఉంటుంది. అయితే తాను కొన్నేళ్ల క్రితం క్యాన్సర్ బారిన పడిన విషయం తెలిసందే. మెటాస్టాటిక్ క్యాన్సర్‌తో తాను ఇబ్బందిపడుతున్నానని 2018లో ఆమే స్వయంగా ప్రకటించారు. మనోధైర్యంతో చికిత్స తీసుకొని ఆ మహమ్మారి నుంచి బయటకు వచ్చి ఎంతో మందిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తాను క్యాన్సర్ బారిన పడినట్లు ప్రకటించడంపై మాట్లాడారు. ''క్యాన్సర్‌తో పోరాడుతున్నానని తెలిసిన సమయంలో ఆ విషయాన్ని అందరితో చెప్పాలనుకోలేదు. కానీ, అప్పట్లో నేనొక ప్రాజెక్ట్ కోసం వర్క్ చేస్తున్నా. ప్రతి వారం ఒక కొత్త ఎపిసోడ్ టెలికాస్ట్ అవుతుండేది. అదే సమయంలో నేను ట్రీట్‌మెంట్ తీసుకోవాల్సి వచ్చింది. చికిత్స కోసం వెళ్లినప్పుడు.. అప్పటివరకూ కనిపించిన నేను ఒక్కసారిగా మాయమయ్యానని ఒక్కొక్కరూ ఒక్కో మాదిరిగా మాట్లాడుకుంటారు. నా గురించి ఇష్టం వచ్చినట్లు ప్రచారాలు చేస్తారు. సోషల్‌మీడియాలో గాసిప్స్ క్రియేట్ చేయవచ్చు. వాటి వల్ల నా కుమారుడు, తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఇబ్బందిపడొచ్చు. అది నాకు ఏమాత్రం నచ్చదు. అందుకే నా ఆరోగ్య పరిస్థితి గురించి నేనే ధైర్యంగా బయటపెట్టాను'' అని ఆమె చెప్పారు.





## ఫ్యాషన్ డిజైనర్‌స్‌కి అనన్య బంపర్ ఆఫర్

టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేస్తున్న తెలుగమ్మాయి అనన్య నాగళ్ల. "మల్లేశం" సినిమాతో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ అమ్మడు, ఆ తర్వాత వరుసగా మంచి చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. సహజమైన నటన, ఆకట్టుకునే రూపంతో అనతికాలంలోనే ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకుంది. ఇక సోషల్ మీడియాలో ఫోటో షూట్లతో మెప్పిస్తుంటుంది. ఉన్నత చదువులు అభ్యసించి సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా కెరీర్ ప్రారంభించిన ఈ అమ్మడు సినిమాలపై మక్కువతో ఇండస్ట్రీలోకి వచ్చింది. అయితే మొదట షార్ట్ ఫిల్మ్ చేసి ఆ తర్వాత హీరోయిన్‌గా మారింది. అనన్య నాగళ్ల ప్లే బ్యాక్, మ్యాస్ట్రో, ఊర్వశివో రాక్షసివో, శాకుంతలం, తంత్ర, డార్లింగ్, పొట్టేల్, శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ తదితర సినిమాల్లో హీరోయిన్ గా , సెకెండ్ ఫీమేల్ లీడ్ రోల్స్ నటించి ప్రేక్షకులని మెప్పించింది. మధ్య మధ్యలో వెబ్ సిరీస్‌లు కూడా చేస్తుంది. ఈ ముద్దుగుమ్మ తాజాగా ఇన్ స్టా స్టోరీస్ లో ఒక పోస్ట్ షేర్ చేసింది. 'ఫ్యాషన్ డిజైనర్ కోసం వెతుకుతున్నాను. 6 సంవత్సరాల అనుభవం ఉన్నవారు ఎవరైన సరే.. దయచేసి మీ రెస్యూమ్ పంపండి' అని అందులో పేర్కొంది. మొత్తానికి అనన్య ఫ్యాషన్ డిజైనర్‌స్‌కి బంపర్ ఆఫర్ ఇచ్చింది. ఈ అవకాశాన్ని మిస్ చేసుకోకండి మరి.

## అలా చేస్తే నాలోని కాళిని చూస్తారు

ఎప్పుడూ సోషల్ మీడియాలో నటి ప్రీతి జింటా యాక్టివ్‌గా ఉంటారు. తాజాగా ఎక్స్ వేదికగా అభిమానులతో ఆమె ముచ్చటించారు. ఇటీవల ఒక సెషన్ కొన్ని ప్రశ్నలకు ఆశ్చర్యకరమైన సమాధానాలు ఇచ్చి వైరల్‌గా మారింది. ఒక అభిమాని ప్రీతిని "సాధారణ ప్రజలకు మీ గురించి తెలియని ఒక విషయం ఏమిటి?" అని అడిగాడు. దానికి ప్రీతి "నాకు ఆలయాల్లో, ఫ్లైట్ తర్వాత ఉదయాన్నే, బాత్రూంలో, భద్రతా తనిఖీల సమయంలో ఫోటోలు తీయడం అస్సలు ఇష్టం ఉండదు. మీరు పైన చెప్పిన సందర్భాల్లో తప్ప, ఫోటో కావాలంటే అడగడమే ఉత్తమ మార్గం" అని చెప్పింది. అలాగే "నా పిల్లల ఫోటోలు తీస్తే నాలోని 'కాళి' బయటకు వస్తుంది. అసలు నేను చాలా సరదా మనిషిని. నా అనుమతి లేకుండా వీడియోలు తీయడం మొదలు పెట్టకండి ఇది చాలా ఇబ్బందికరం. నన్ను నేరుగా అడగండి, దయచేసి నా పిల్లలను వదిలేయండి". అని చెప్పుకొచ్చింది.



## 'ఓజీ' సెట్‌లో పవన్ సందడి

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఓజీ' సినిమాకు సంబంధించి ఒక అప్‌డేట్ వచ్చింది. పవన్ కల్యాణ్ బుధవారం నుంచి ఈ సినిమా చిత్రీకరణలో పాలు పంచుకుంటున్నారని చిత్ర నిర్మాణ సంస్థ పీఆర్ టీమ్ తెలిపింది. "అసలైన 'ఓజీ' సెట్‌లోకి అడుగుపెట్టారు" అంటూ వారు చేసిన ప్రకటనతో పవన్ ఫ్యాన్స్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇప్పటికే 'హరిహర వీరమల్లు' సినిమా చిత్రీకరణను పూర్తి చేసుకున్న పవన్ కల్యాణ్, ఇప్పుడు 'ఓజీ' సినిమాను శరవేగంగా పూర్తి చేసేందుకు సిద్ధమయ్యారు. ఇటీవలే ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్, ప్రస్తుతం తుది దశకు చేరుకుంది. ఇన్నాళ్లు పవన్ కల్యాణ్ డేట్స్ కోసమే చిత్ర బృందం వేచి చూసినట్లు సమాచారం. తాజా షెడ్యూల్‌తో సినిమా మొత్తం చిత్రీకరణను ఒకేసారి పూర్తి చేయాలని దర్శకుడు సుజీత్, నిర్మాత డీవీవీ దానయ్య ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at M R Publications, #6-31880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500070. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy, Hyderabad, Telangana 501203. Editor : K PRAVEEN KUMAR. Phone number 9177920459, email id : prajakshetram1@gmail.com, https://prajakshetram.in, RNI NO. TELTEL/12330